క్లుప్తంగా

కేవీలో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్, కేవీ కమిటీ చైర్‌పర్సన్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కేవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. కేవీ పీఎం శ్రీగా మారినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి గురించి డీఈఓ అబ్దుల్‌హై, జిల్లా వైద్యాధికారులు, నిట్ ప్రొఫెసర్లు, కేవీ పబ్లిక్ వర్క్స్ అధికారులకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుభాషిణి వివరించారు. కార్యక్రమంలో కేవీ ఉపాధ్యాయులు స్మిత, భిక్షపతి, ఉదయ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా నిర్మల



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా కాజీపేట 47వ డివిజన్ ప్రాంతానికి చెందిన బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షురాలు నవనగిరి నిర్మల నియామకం అయ్యారు. ఈమేరకు రైల్వే మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇటికాల మధుసూదన్‌రావు సేవలు చిరస్మరణీయం



కాజీపేట అర్బన్: నాటి ఆర్ఈసీ నేటి నిట్ వరంగల్ నిర్మాణంలో ఇటికాల మధుసూదన్‌రావు సేవలు చిరస్మరణీయమని నిట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొలిపాక కర్ణాకర్ కొనియాడారు. మధుసూదన్‌రావు 59వ వర్ధంతి సందర్భంగా నిట్ వరంగల్ మెయిన్ గేట్ ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ రాంచందర్, సర్వేశం, పోచయ్య, రాజు, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బీఎల్.వర్మకు సన్మానం



హన్మకొండ: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు హనుమకొండకు వచ్చిన కేంద్ర ఈశాన్య రాష్ట్రాలు, సహకార శాఖ మంత్రి బీఎల్.వర్మను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు సన్మానించారు. ఎన్ఐటీలోని అతిథి గృహంలో కేంద్ర మంత్రిని శుక్రవారం మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందం గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి చల్లా జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పిండి వంటలు



కాజీపేట అర్బన్: సంపూర్ణ ఆరోగ్యానికి, రోగ నిరోధక శక్తికి తోడ్పడే చిరుధాన్యాలతో సంక్రాంతి పిండి వంటలు చేసుకోవాలని రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షులు కుసుమ కవిత తెలిపారు. చిరుధ్యాన్యాలతో వంటకాలపై శిక్షణ కార్యక్రమాన్ని కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిండి వంటకాల తయారీ, రాగి, జొన్న మురుకులు, కొర్ర దోశ, తదితర చిరుధాన్యాల వంటకాలపై అవగాహన కల్పించారు. మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్, ప్రియాంక, మౌనిక, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మడికొండ: కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామ శివారులోని చెరువు శిఖం భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన అదే గ్రామానికి చెందిన మల్లయ్య, వెంకటేష్‌పై కేసు నమోదైనట్లు ఎస్సై జక్కుల రాజబాబు తెలిపారు. జేసీబీ సహాయంతో చదును చేసేందుకు ప్రయత్నించగా ఇరిగేషన్ ఏఈ మమత ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నయీంనగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

నయీంనగర్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 6వ డివిజన్ కుమార్‌పల్లి మార్కెట్ వాటర్ ట్యాంక్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 6గ్యారంటీ స్కీమ్‌లను అమలుచేస్తామని ఇచ్చిన మాట ప్రకారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, డివిజన్ అధ్యక్షుడు శివాజీ, ఓబీసీ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్ యాదవ్, లక్ష్మణ్, ఆర్పీలు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం..

హసన్‌పర్తి: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ప్రజాపాలనలో భాగంగా హసన్‌పర్తి మండలం సీతంపేటలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాగరాజు పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన వారందరికీ వర్తింపజేస్తామని తెలిపారు. అవసరమైతే దరఖాస్తుల స్వీకరణ గడువు మరో నాలుగు రోజులు పొడిగిస్తామని చెప్పారు. స్థానిక సర్పంచ్ జనగాం శరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ బండారి రజిత, ఉపసర్పంచ్ భగవాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చేరాలు, తిరుపతి, రమేష్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన ప్రజాపాలన

- వరంగల్ జిల్లాలో 46,895, హనుమకొండలో 31,622 దరఖాస్తుల స్వీకరణ

హన్మకొండ అర్బన్/కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రెండో రోజు శుక్రవారం వరంగల్ జిల్లాలోని 13 మండలాలతోపాటు వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ పరిధిలోని 32 డివిజన్లలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 46,895 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. హనుమకొండ జిల్లాలో 71కేంద్రాల్లో వినతులు స్వీకరించగా మొత్తం 31,622 అందినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల దరఖాస్తులు మొత్తం 45,924కు చేరాయి.

కార్యకర్తలకు అండగా ఉంటా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: తన గెలుపుకోసం, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో టీపీసీసీ కార్యదర్శి ఈవీ.శ్రీనివాస్‌రావు అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపుకోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్త తన కుటుంబ సభ్యుడే అన్నారు. వారికి ఏకష్టం వచ్చినా వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు. ఎన్నికల హామీ మేరకు ఎక్కువ ఓట్లు పోలైన బూత్ ఇన్‌చార్జ్‌లకు త్వరలో ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దొమ్మాటి సాంబయ్య, కార్పొరేటర్లు తోట వెంకన్న, జక్కుల రవీందర్, విజయశ్రీరజాలీ ఉన్నారు.

కళాశాలలో సదుపాయాలు కల్పించండి

విద్యారణ్యపురి: తమ కళాశాలలో 3,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈక్రమంలో భవన సముదాయం కల్పించాలని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ రాజారెడ్డి కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి సన్మానం

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని హనుమకొండ వడ్డెపెల్లిలోని టీచర్స్‌కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు ఇమ్మడి పుల్లయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



జెండాను ఆవిష్కరిస్తున్న మంద శ్రీకాంత్

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై విద్యార్థులు పోరాడాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ సూచించారు. ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండలో ఎస్‌పీఆర్ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను శ్రీకాంత్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1970లో కేరళలో ఎస్ఎఫ్ఐ ఏర్పాటు అయిందని వివరించారు. అప్పటి నుంచి దేశంలో విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, మంద వికాస్, కార్తీక్, సందీప్, శివరాజ్, కుమార్, అభిరామ్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

1నుంచి శ్రీరాముడి పూజిత అక్షింతల వితరణ

హన్మకొండ కల్చరల్: అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షింతలు జనవరి ఒకటి నుంచి నగరంలో ప్రతీ ఇంటికి పంచనున్నట్లు కాకతీయ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు చొల్లేటి కృష్ణమాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండ కాపువాడ, మచిలీబజార్, అంగడిబజార్, గొల్లవాడ ప్రాంతాల్లో గురువారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎడెల్లి ఎల్లారెడ్డి, సిరికొండ శ్రీధర్, మాడిశెట్టి శివకుమార్, సిరికొండ సుజాత, కవిత, నాసం కరుణ, పిన్నింటి జ్యోతి, శైలజ, కల్పన, వెంకటలక్ష్మి, ఉమ, సంధ్యారాణి, దుంపేటి రమ, ఎడెల్లి జ్యోతి పాల్గొన్నారు.

శ్రీరామ అక్షింతలను అందుకున్న భక్తులు

కాజీపేట: అయోధ్య పట్టణం నుంచి కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలోకి వచ్చిన శ్రీరామ అక్షింతలను హిందూ ధార్మిక సంఘాల నాయకులు శుక్రవారం స్వీకరించారు. ప్రత్యేక వాహనంలో పుర వీధుల మీదుగా ఊరేగింపుగా వచ్చిన అంక్షింతలను హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపించి భద్రపరిచారు. ఈ అంక్షింతలను జనవరి 1వ తేదీ నుంచి భక్తులకు అందజేయనున్నట్లు కాయిత రాజ్‌కుమార్ యాదవ్ తెలిపారు.

చింతల్‌లో అక్షింతలతో శోభాయాత్ర

కాశిబుగ్గ: అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్రను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కమిటీ చింతల్ బస్తీవాసులు 36వ డివిజన్ చింతల్‌లో గురువారం రాత్రి నిర్వహించారు. కట్ట మైసమ్మ తల్లి గుడి నుంచి చింతల్‌లోని భక్త హనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించి అక్కడ అక్షింతలను భద్రపరిచారు.

వరంగల్ కోటలో విద్యార్థుల సందడి



కాకతీయుల విశిష్టతను వివరిస్తున్న కోట గైడ్

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ కోటకు పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం భారీగా సంఖ్యలో తరలివచ్చారు. దాంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం విద్యార్థులతో కిటకిటలాడుతూ సందడిగా మారింది. ఈ సందర్భంగా వారు అద్భుతమైన శిల్ప సౌందర్యాలను తిలకించారు. నల్ల రాతిలో శిల్పాలు చెక్కిన శిల్ప సంపద, ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను వీక్షించారు. కాకతీయుల విశిష్టతను కోట గైడ్ రవియాదవ్ వివరించారు. అనంతరం ఏకశిల చిల్డ్రన్ పార్క్‌లోని ఆహ్లాదాన్ని పంచే చెట్లనీడన సేదతీరారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ కోట ఇన్‌చార్జ్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ అజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న తోట రవీందర్

హన్మకొండ: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, సమాజంలోని ప్రతీ సమస్య విద్యతోనే పరిష్కారమవుతుందని ప్రవాస భారతీయుడు తోట రవీందర్ అన్నారు. హనుమకొండ పూరిగుట్టలోని సాయి సేవా ట్రస్టులో అనాథలకు విద్య ప్రాముఖ్యతపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలు అభద్రతాభావానికి లోనుకాకూడదని సూచించారు. అనాథలకు విద్యను అందించాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందని గుర్తుచేశారు. బాలల హక్కులను అధికారులు కాపాడాలని కోరారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మండల పరశురాములు మాట్లాడుతూ ప్రతీ పౌరుడు అనాథ పిల్లల అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. సాయి సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు చిన్నాల రంగయ్య అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లక్ష్మీకాంతరావు, శ్రీనివాసరావు, ప్రభాకర్ రెడ్డి, భగవాన్ దాస్, ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కునిశెట్టి సుబ్బారావు కుమారుడు ఎన్ఆర్ఐ లక్ష్మి – సునీల్ ఆర్థిక సాయంతో ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులకు నిత్యావసర సరుకులు, బియ్యం శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెండ్లి కృష్ణమూర్తి, రమేష్, అంకం సురేష్, దండిగం సతీష్ యాదవ్, అనిల్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన పలు పార్టీల నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

'అద్దె బస్సుల' సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

హన్మకొండ: ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ -2 డిపో అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డి కోరారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ -2 డిపో మేనేజర్ సురేష్‌ను అసోసియేషన్ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, దాంతో బస్సులపై భారం పడుతోందని తెలిపారు. ఫలితంగా కేఎంపీఎల్ తగ్గిందని, ప్రయాణికుల బరువు పెరిగి టైర్లు పగులుతున్నాయని వివరించారు. అడుగడుగునా బస్సు ఆపడంతో భారం పడుతోందని వివరించారు.

వృద్ధులకు సదుపాయాలు కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని సందర్శించే వయోవృద్ధులకు ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తేరాల యుగంధర్, కొండ్రెడ్డి మల్లారెడ్డి కోరారు. ఈమేరకు దేవాలయ ఈఓ శేషుభారతికి శుక్రవారం వినతిపత్రంతోపాటు తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం -2007 రూల్స్ బుక్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవాలయంలో శుక్ర, శని, ఆదివారాలు, పండుగ దినాల్లో భక్తుల అధిక రద్దీ కారణంగా వృద్ధులకు అమ్మవారి దర్శనం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు.

శ్రీరామ శోభాయాత్రను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: అయోధ్య రామ జన్మభూమి నుంచి శనివారం సాయంత్రం నగరానికి రానున్న పవిత్ర అక్షింతల స్వాగత శోభాయాత్రను విజయవంతం చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్ శంభునిపేట సంయోజక్ కందగట్ల శ్రీరామ్, విశ్వనాథ కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఆంజనేయ స్వామి గుడి వద్ద స్వాగత ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్, విశ్వనాథ కాలనీ నుంచి శంభునిపేట మీదుగా హనుమాన్ దేవాలయం వరకు శ్రీరాముడి అక్షింతల స్వాగత శోభాయాత్ర సాగనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పస్తం భిక్షపతి, సత్యనారాయణ, రుక్మాచారి, మిరియాల సంపత్, రవిబాబు, సదానందం, ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాల వద్ద సభ్యులు

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ పుప్పాలగుట్ట ముత్యాలమ్మ దేవాలయంలో నూతన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. ఉదయం మండప పూజలు, ధ్యానరత్న శిలాదివాసాలు చేసి అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య యంత్ర ప్రతిష్ఠ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. దేవాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో అర్చకులు వెంకటేశ్వర శర్మ, మనోజ్, శివమణి, అనికేత్ నిర్వాహకులు ఎల్.శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముస్లింలను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల్‌పాషా

నయీంనగర్: కర్ణాటకతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముస్లిం మైనార్టీలు ప్రధాన కారణమని, ఈక్రమంలో వారిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అఖిల్‌పాషా కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రానున్న మంత్రివర్గ విస్తరణలో నాయకుడు ఎండీ.అజారుద్దీన్‌కు అవకాశం ఇవ్వాలని, అద్దంకి దయాకర్‌కు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎండీ.మజహర్ హుస్సేన్, ఎండీ.ఫారూక్, అబిద్, నవాజ్, సతీష్ పాల్గొన్నారు.

'విరాహత్ అలీ'కి అభినందనలు



విరాహత్ అలీని సన్మానిస్తున్న జర్నలిస్టులు

నయీంనగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికైన విరాహత్ అలీకి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, ఐజేయూ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరాం, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, వరంగల్ జిల్లా నాయకులు శ్రీరాం రామచందర్, మట్ట దుర్గాప్రసాద్, మిద్దెల రంగనాథ్, గాడిపెల్లి మధు, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

హసన్‌పర్తి: 66వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు, హసన్‌పర్తి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు నాగమళ్ల సురేష్ వర్ధంతిని పురస్కరించుకుని ఎన్ఎస్.ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, దేవస్థాన మాజీ ధర్మకర్త గౌరిశెట్టి కృష్ణమూర్తి, ఫౌండేషన్ సభ్యులు మేకల యుగేంధర్, రవిప్రసాద్, రాకేష్, రమేష్, గణేష్, వేల్పుల సంపత్ పాల్గొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమానికి పోటెత్తిన ప్రజలు

ఖిలా వరంగల్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నగరంలో రెండో రోజు శుక్రవారం కొనసాగింది. 33, 34, 37, 38, 39వ డివిజన్లలో ఏర్పాటు చేసిన సెంటర్లకు జనం పోటెత్తారు. కొన్ని కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అర్హులందరికీ దక్కుతాయని పోపా రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత శామంతుల శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజలకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నేతలు విజయ రాంచందర్ పట్వారి సుధాకర్, అంకం సత్యం, నూనె రవి, కిరణ్, వెంకట్, మధు, శ్రీధర్ సదానందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫారాల కోసం ఇబ్బందులు

కాశిబుగ్గ: ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తు ప్రక్రియ రెండోరోజు శుక్రవారం కొనసాగింది. ఉదయం నుంచే దరఖాస్తుదారులు సెంటర్ల వద్దకు పరుగులు తీశారు. 19వ డివిజన్ వీకర్ సెక్షన్ కాలనీ కమ్యూనిటీ హాల్ సెంటర్‌లో దరఖాస్తుల కోసం సిబ్బందికి ప్రజలకు మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. 20వ డివిజన్ కాశిబుగ్గ బీఎస్‌రావు కమ్యూనిటీ హాల్ సెంటర్, 18వ డివిజన్ ప్రతాప్‌నగర్ సెంటర్, 35వ డివిజన్ సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉదయమే దరఖాస్తులు ఇవ్వడంతో ఆ సమయంలో రానివారికి ఫారాలు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరాలి

హన్మకొండ: అర్హులందరికి ప్రభుత్వ పథకాలు చేరవేయాలని అధికారులకు బీజేపీ కార్పొరేటర్ చాడా స్వాతి సూచించారు. 52వ డివిజన్ హనుమకొండ నందితారే నగర్‌లో శుక్రవారం జరిగిన ప్రజాపాలనలో పాల్గొని ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు.

విలీన గ్రామాల్లో కౌంటర్లు ఏర్పాటు చేయాలి

హసన్‌పర్తి: కార్పొరేషన్‌లో విలీనమైన అన్ని గ్రామాల్లో దరఖాస్తు స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. డివిజన్ పరిధిలో నాలుగైదు గ్రామాలు ఉంటే కేవలం ఒక గ్రామాన్ని డివిజన్ కేంద్రంగా ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దాంతో దూరంగా ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎక్కువ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బియ్యం అందజేస్తున్న యుగేంధర్

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మరణించిన మల్లారెడ్డిపల్లికి చెందిన వక్కెల్లి సాంబయ్య కుటుంబ సభ్యులను ఉపసర్పంచ్ యుగేంధర్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి 50కిలోల బియ్యం అందించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ అమితారెడ్డి

హసన్‌పర్తి: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బండా అమితారెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ చల్లా ప్రసాద్, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సాయిలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.